క్లుప్తంగా

ఉచిత శిక్షణకు దరఖాస్తులు

మహబూబాబాద్ అర్బన్: తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో అర్హులైన మైనార్టీ అభ్యర్థులకు గ్రూప్–1 నుంచి గ్రూప్–4 వరకు రైల్వే, బ్యాంక్ మొదలైన వివిధ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనార్టీ శాఖ అధికారి బి.శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. జిల్లాలోని మైనార్టీ అభ్యర్థులు ఈనెల 16న కలెక్టర్ కార్యాలయంలో మొదటి అంతస్తు ఎఫ్ 17లోని మైనార్టీ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు 91825 40680, 95737 69507 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

షిర్డీ సాయినాథుడికి లక్ష పుష్పార్చన



మహబూబాబాద్ రూరల్: షిర్డీ సాయినాథుడికి లక్షపుష్పార్చన పూజా కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని శ్రీసాయి మందిరంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సాయినాథుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించి 25ఏళ్లు అయిన సందర్భాన్ని పురస్కరించుకుని లక్షపుష్పార్చన పూజ చేశామని శ్రీసాయి మందిర సేవా ట్రస్ట్ అధ్యక్షుడు వందనం కమల్, కార్యదర్శి ఇమ్మడి చంద్రప్రకాష్, కోశాధికారి బొడ్ల రామకృష్ణ తెలిపారు.

హాకీ పోటీలకు ఎంపిక



కేసముద్రం: మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఈనెల 2నుంచి 7వరకు జరగనున్న జాతీయ స్థాయి హాకీ పోటీలకు కేసముద్రంస్టేషన్ జెడ్పీహైస్కూల్‌కి చెందిన బాదావత్ సాయిరాం అనే విద్యార్థి ఎంపికైనట్లు పీడీ కొమ్ము రాజేందర్ తెలిపారు.

పారిశుద్ధ్య పనుల్లో డ్రైవర్ల పాత్ర కీలకం



మహబూబాబాద్: పారిశుద్ధ్య విభాగంలో డ్రైవర్ల పాత్ర కీలకమని మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ కార్యాలయంలో పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న 16మంది డ్రైవర్లను ఉత్తమ డ్రైవర్లుగా ఎంపిక చేసి మంగళవారం అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, కమిషనర్ నోముల రవీందర్, డీఈ సీహెచ్ ఉపేందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రాజేష్, శ్రీనివాస్, వాహనాల ఇన్‌చార్జ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ టీఎస్ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సంకా బద్రినారాయణ, ప్రధాన కార్యదర్శి మిర్యాల సతీష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే టీపీటీఎఫ్ క్యాలెండర్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి ఆవిష్కరించారు.

మహబూబాబాద్ రూరల్: జిల్లా జవాన్ల నూతన సంవత్సర క్యాలెండర్ ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ చేతుల మీదుగా జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, అజారొద్దీన్ (మాజీ ఆర్మీ జవాన్) సైనికులు కొట్టె నగేష్, కోడుమూరి మహేష్, బోడ మల్సూర్, తిలక్ పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యదర్శిగా అహ్మద్



మహబూబాబాద్ రూరల్ : తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా మహబూబాబాద్ ప్రిన్సిపల్ జిల్లా కోర్టులో పనిచేస్తున్న ఉద్యోగి ముబీన్ అహ్మద్‌ను నియమిస్తూ సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షుడు స్థితప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

న్యూ ఇయర్ వేడుకలు

నూతన సంవత్సర రాకను పురస్కరించుకుని మంగళవారం ఆలయాలు, చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. పలు పాఠశాలల్లో ముందస్తు న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించారు. బేకరీలలో భారీగా కేకులను విక్రయించారు. ఇళ్ల ముంగిట నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ ముగ్గులు వెలిశాయి. - సాక్షి నెట్‌వర్క్



చిన్నగూడూరు: సమర్థ విద్యానికేతన్ పాఠశాలలో కేక్ కట్ చేస్తున్న విద్యార్థులు



మహబూబాబాద్ అర్బన్: హోలివర్డ్స్ హైస్కూల్‌లో న్యూ ఇయర్ వేడుకలు..



మహబూబాబాద్ రూరల్: విద్యుత్ దీప కాంతుల్లో సీఎస్ఐ చర్చి



డోర్నకల్: డోర్నకల్‌లో కేకుల దుకాణం వద్ద ప్రజల సందడి



కురవి: నాగార్జున పాఠశాలలో వెల్‌కమ్ ఆకృతిలో విద్యార్థులు

రైతుల బాధలు తీర్చిన ప్రభుత్వం

● మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి



మాట్లాడుతున్న చైర్మన్ గంట సంజీవరెడ్డి

కేసముద్రం: ధరణితో నారాయణపురం గ్రామరైతులు పడిన బాధలను, భూ భారతితో తీర్చిన ఘనత రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో జరిగిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి కారణంగా వ్యవసాయభూములన్నీ పట్టాదారుకాలంలో అడవి అనే పేరు రావడంతో రైతులు ఇబ్బందులు పడ్డారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, గుగులోతు దస్రూనాయక్, వెంకన్న, సురేందర్, మురళీ, శ్రీనివాస్‌రెడ్డి, వసంతరావు పాల్గొన్నారు.

కిసాన్ క్రెడిట్ కార్డుపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న అధికారి కిరణ్‌కుమార్

కొత్తగూడ: రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కిసాన్ క్రెడిట్ కార్డుపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి కిరణ్‌కుమార్ సూచించారు. మండలకేంద్రంలోని పశు వైద్య శాలలో పశు సంవర్ధక శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.1.60లక్షల వరకు ఎలాంటి జామీను లేకుండా రుణం తీసుకుని 7శాతం వడ్డీతో తిరిగి చెల్లించుకునే అవకాశం క్రెడిట్ కార్డు ద్వారా రైతులకు అందుతుందన్నారు. భూ ధృవీకరణ తనఖా ద్వారా రూ.3లక్షల రుణం లభిస్తుందన్నారు. అదే విధంగా మండలంలో పశుగణన చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పశుగణన నోడల్ అధికారి శ్రావణ్, పశు వైద్యాధికారులు శ్రీకాంత్, నరేష్, కోటి రెడ్డి, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి

● సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు



అభివాదం చేస్తున్న సంఘం నాయకులు

మహబూబాబాద్/నెహ్రూసెంటర్: మున్సిపల్ కార్మికులకు 11వ పీఆర్సీ ప్రకారం కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ఆకుల రాజు, కుంట ఉపేందర్ డిమాండ్ చేశారు. స్థానిక గాంధీపార్క్ ఆవరణలో మంగళవారం బీఆర్టీయూ నుంచి కార్మికులు సీఐటీయూలో చేరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 25 తర్వాత నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు నాగన్న, శ్రీను, ఎల్లయ్య, విజయ్, పద్మ, రజినికుమార్, శ్రీధర్ పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలతో ఇబ్బందులు

● సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

నెల్లికుదురు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ మండిపడ్డారు. మండల కేంద్రంలోని విశ్రాంతి భవనంలో మంగళవారం సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజల్లో ఉన్మాదాన్ని రెచ్చగొడుతూ కాలయాపన చేస్తుందన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని వాగ్దానం చేసిన ప్రధాని మోదీ అనుసరిస్తున్న విదానాలతో ఉన్న ద్యోగాలు పోయే పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గుణగంటి రాజన్న మండల కార్యదర్శి ఇసంపల్లి సైదులు, నాయకులు బాబు గౌడ్, పుల్లన్న, నరసన్న, ఉప్పలయ్య, ఎల్లయ్య, వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలి

● పద్మశాలి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకన్న



మాట్లాడుతున్న వెంకన్న

గార్ల: రాష్ట్రంలో జనాభా దామాషా ప్రకారం పద్మశాలీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని పద్మశాలి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, జిల్లా అధ్యక్షుడు వేముల వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వర్తకసంఘం భవనంలో జరిగిన సంఘం మండల జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంఘం మండల అధ్యక్షుడు అలువాల రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కోర్టు ఏజీపీ తాటిపాముల సునీత, చిలుక నర్సయ్య, కోట ఉత్తరయ్య, డూరు గొండ పాండు, వేముల రవీందర్, జంగం శ్రీను, చిలుక శ్రీనివాస్, బేతి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బీకునాయక్ సేవలు మరువలేనివి



బీకునాయక్ విగ్రహం ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో అనేక సార్లు గెలిచి ప్రజాప్రతినిధిగా నిత్యం ప్రజాజీవితంలో ఉంటూ అన్నివర్గాల ప్రజలకు సేవలు అందించిన బీకునాయక్‌ను ఎప్పటికీ మరువలేరని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని పెద్దమంగ్యా తండాలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ బీకునాయక్ విగ్రహాన్ని దయాకర్‌రావు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రామచంద్రునాయక్, గాంధీనాయక్, డాక్టర్ పొనుగోటి సోమేశ్వర్‌రావు, పసుమర్తి సీతారాములు, మంగళపెల్లి శ్రీనివాస్, తూర్పాటి అంజయ్య, ఎన్నమనేని శ్రీనివాస్‌రావు, అనుమాండ్ల ప్రదీప్‌రెడ్డి, కుర్ర శ్రీనివాస్‌గౌడ్, కాలునాయక్, జైసింగ్, జనార్దన్‌రాజు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు మార్కెట్‌కు సెలవు

కేసముద్రం: కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా సెలవు ప్రకటించినట్లు మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు గమనించాలని కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గార్ల: నిరంతరం జరుగుతున్న సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై ఎస్‌కె రియాజ్‌పాషా సూచించారు. మండలంలోని పినిరెడ్డిగూడెం గ్రామంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వాట్సాప్‌ల్లో, మెస్సేజ్‌ల్లో లింక్‌లు వస్తే వాటిని క్లిక్ చేయవద్దన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సుధాకర్ పాల్గొన్నారు.

సీపీఎం కార్యాలయం ప్రారంభం

కేసముద్రం: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీపీఎం కార్యాలయాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు గుణిగంటి రాజన్న, మార్తినేని పాపారావు, మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న, జల్లె జయరాజ్, యాకుబ్‌రెడ్డి పాల్గొన్నారు.

గూడూరులో డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్

గూడూరు: 2024 సంవత్సరం చివరిరోజు సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు చేపట్టినట్లు సీఐ బాబూరావు, ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం రాత్రి బస్టాండ్ సెంటర్‌లో ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు తనిఖీ చేశారు. అందులో భాగంగా డ్రైవింగ్, వాహనపత్రాలను పరిశీలించారు. ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడిపుతూ పట్టుబడితే జరిమానా విధిస్తామన్నారు.

పశు వైద్యశిబిరం

గూడూరు: మండలంలోని అయోధ్యపురంలో మంగళవారం జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం, దూడల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి నాళ్లం అశోక్, ఏరియా గోపాలమిత్ర సూపర్‌వైజర్ కె.రఘువీర్, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

వీఓఏ అవకతవకలపై విచారణ

బయ్యారం: మండలంలోని బాలాజీపేట వీఓఏ వసంత ఆర్థికపరంగా అవకతవకలకు పాల్పడ్డారని పలువురు మహిళలు ఉన్నతాధికారులు ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా మంగళవారం పంచాయతీ కార్యాలయం వద్ద విచారణ నిర్వహించారు. డీఆర్‌డీఏ ఏపీడీ జయశ్రీ, డీపీఎంలు శంకర్, శ్రీనివాస్, శ్రీనిధి ఆర్‌ఎం మధుసూధన్‌లు పొదుపు సంఘాల వారీగా మహిళలను బహిరంగంగా విచారణ చేసి వాంగ్మూలాలను రికార్డ్ చేశారు.

సీఎం స్పందించాలి

మహబూబాబాద్: ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపడుతున్న నిరవధిక సమ్మెకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాకుబ్, సంఘం జిల్లా అధ్యక్షుడు వీరన్న, ప్రభాకర్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి

కురవి: దేశంలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ఉపాధి కల్పించాలని ఎస్ఎఫ్ఐ నాయకుడు అనంతుల నరేష్ అన్నారు. మంగళవారం మండలంలోని నేరడ జెడ్పీ హైస్కూల్ ఆవరణలో సంఘం ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు.

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా మల్లారెడ్డి

మహబూబాబాద్ అర్బన్: ఈనెల 28 నుంచి 30 తేదీల్లో నల్లగొండ జిల్లాలో జరిగిన టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర 6వ మహాసభల్లో మానుకోట జిల్లా కంబాలపల్లి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు రాష్ట్ర కార్యదర్శిగా సామ మల్లారెడ్డిని రెండోసారి ఎన్నుకున్నందుకు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ, యాకూబ్ మంగళవారం హర్షం వ్యక్తం చేశారు.

ఎంపీ శుభాకాంక్షలు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎంపీ పోరిక బలరాం నాయక్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

తొర్రూరు: రైస్ డ్రైవర్స్ సమస్యలను పరిష్కరించాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా అధ్యక్షుడు కొత్తపెల్లి రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కొన్నిరోజులుగా వేతనాలు పెంచాలని సమ్మె చేస్తున్న సంబంధిత రైస్ మిల్లుల యజమానులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ సమావేశంలో యాకయ్య, బాలు, శ్రీను, వెంకన్న పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై దాడి హేయమైన చర్య

నెహ్రూసెంటర్: రంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల దళిత హెచ్‌ఎంపై దాడి హేయమైన చర్య అని, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మందుల మహేందర్, చేపూరి గణేష్, ఖాదర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి కురాష్ పోటీలకు ఎంపిక



కురవి: మండలంలోని నేరడ గ్రామంలోని మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు జాతీయస్థాయి కురాష్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వై.శ్రీకాంత్, పీడీ ఐనాల సురేష్ మంగళవారం తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో ఎస్‌జీఎఫ్ఐ జాతీయస్థాయి అండర్–14, 17 విభాగాల్లో విద్యార్థులు ఎల్.చరణ్, డి.బన్ని, ఎల్.సుశాంత్, బి.శ్రీకాంత్ పాల్గొంటారని తెలిపారు. వీరిని పాఠశాలలో అభినందించారు.

కబ్జా కాకుండా చర్య తీసుకోవాలి

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని ఆఫీసర్ క్లబ్ స్థలం కబ్జా కాకుండా చర్య తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సమ్మెట రాజమౌళి డిమాండ్ చేశాడు. పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ నోముల రవీందర్‌కు వినతిపత్రం అందించారు. 17వ వార్డు పరిధిలో ఉన్న స్మశానవాటికలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు.

భూములను పరిరక్షించాలి

నెహ్రూసెంటర్: భూకబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూములను పరిరక్షించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి అన్నారు. జిల్లా కేంద్రంలో అన్యాక్రాంతానికి గురవుతున్న స్థలం వద్ద పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని విలువైన తొర్రూరు బస్టాండ్ స్థలం, ఓసీ క్లబ్ స్థలాన్ని ఆక్రమించేందుకు భూకబ్జాదారులు యత్నిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు హేమానాయక్, సైదులు, వెంకన్న, శ్రీను, తాజ్, వెంకన్న పాల్గొన్నారు.

పాల ఉత్పత్తి పెంపునకు కృషి

తొర్రూరు రూరల్: పాల ఉత్పత్తి పెంపునకు నిరంతరం కృషి చేస్తున్నట్లు విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రావణ్‌కుమార్ అన్నారు. మండలంలోని వెలికట్ట గ్రామ శివారులోని పాల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో బదిలీపై వెళ్లిన తొర్రూరు డెయిరీ మేనేజర్ హన్మంతును రైతులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డెయిరీ చైర్మన్ రాసాల సమ్మయ్య, ఇన్‌చార్జ్ మేనేజర్ వెంకటనారాయణ, పాడి రైతులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

నర్సింహులపేట: మండల కేంద్రంలోని హైస్కూల్, మోడల్ స్కూళ్లలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మంగళవారం తొర్రూరు లయన్స్ క్లబ్, నర్సింహులపేటకు చెందిన యదళ్ల రవీందర్‌రెడ్డి ఆర్థిక సహకారంతో 73 మంది విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్‌ను డీఈఓ రవీందర్‌రెడ్డి విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఫ్ఏఓఎం బుచ్చయ్య, ప్లానింగ్ కోఆర్డినేటర్ పూర్ణచందర్, ఇన్ చార్జ్ హెచ్ఎం వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

తొర్రూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్సై ఉపేందర్ కథనం ప్రకారం.. మండలంలోని మాటేడు గ్రామ శివారులోని బొప్పాయి తోట వద్ద ఖమ్మం–వరంగల్ జాతీయ రహదారిపై సుమారు (55) ఏళ్ల వయస్సు కలిగిన ఓ వ్యక్తి నడుచుకుంటూ వెళ్తుండగా ఓ భారీ వాహనం ఢీకొని అతనిపై నుంచి వెళ్లడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. దీంతో మృతుడిని గుర్తు పట్టే పరిస్థితి లేకపోవడంతో మాటేడు గ్రామ పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతుడి వివరాలు, గుర్తు తెలియని వాహనం వివరాలు సేకరిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

కేసముద్రం: నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో తల్లి మృతి చెందగా, నేడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తండ్రి మృతి చెందాడు. దీంతో ఒంటరైన ఒక్కగానొక్క కూతురు తన చిట్టిచేతులతో తండ్రికి అంత్యక్రియలు నిర్వహించిన విషాద సంఘటన ఇనుగుర్తి మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై మురళీధర్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వర్దోలు సతీష్(36) అనూష దంపతులకు కూతురు వైష్ణవి(4వ తరగతి) ఉంది. నాలుగేళ్ల క్రితం భార్య అనూష మృతి చెందింది. అప్పటి నుంచి సతీష్ మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో ఇటీవల జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. వరంగల్ ఎంజీఎంలో చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందాడు. దీంతో కూతురు తండ్రికి తలకొరివి పెట్టిన దృశ్యాన్ని చూసిన స్థానికులు కంటతడి పెట్టుకున్నారు. మృతుడి తండ్రి సాయిలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోక్సో కేసు నమోదు

డోర్నకల్: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు డోర్నకల్ సీఐ బి.రాజేష్ తెలిపారు. మంగళవారం సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై ఫకీరాతండాకు చెందిన వీరన్న రెండు రోజుల క్రితం లైంగికదాడికి పాల్పడినట్లు తెలిపారు. బాధిత బాలికను వైద్య పరీక్షల కోసం ఏరియా ఆస్పత్రికి తరలించి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వీరన్నపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో సురేష్ అనే యువకుడు అత్యాచారయత్నానికి పాల్పడినట్లు సీఐ తెలిపారు. బాలిక కేకలు వేయడంతో యువకుడు పారిపోయినట్లు పేర్కొన్నారు. బాధిత బాలిక కుటుంబ సభ్యులతో పాటు చైల్డ్‌లైన్ అధికారుల ఫిర్యాదు మేరకు సురేష్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కొత్తగూడ: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలైన సంఘటన మండలంలోని కిష్టాపురం క్రాస్ రోడ్డు వద్ద జరిగింది. కార్లాయి గ్రామానికి చెందిన గుమ్మడి కిట్టు, పిడబోయిన సందీప్ మండలకేంద్రంలో పని చూసుకుని ఇంటికి తిరిగి వెళ్తుండగా మరో గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్రవాహనాలు మలుపు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈఘటనలో కిట్టు, సందీప్‌లకు తీవ్రగాయాలు కాగా మరో వ్యక్తికి పాక్షిక గాయాలయ్యాయి. ముగ్గురిని 108 ద్వారా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

చిన్నగూడూరు: మండలంలోని ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన బొల్లం విఘ్నేశ్వర్(55) మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన బొల్లం విఘ్నేశ్వర్ తన కుటుంబ సభ్యులతో కొన్నేళ్లుగా ఉపాధి నిమిత్తం ఖమ్మంలో నివాసముంటున్నాడు. మంగళవారం ఉదయం అకస్మాత్తుగా గుండెపోటుకు గురై మృతి చెందాడు. ఆర్థిక భారంతో తన స్వగ్రామానికి మృతదేహం రాక ఖమ్మంలోనే అంత్యక్రియలు నిర్వహించినట్లు స్థానికులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మాజీ ఉపసర్పంచ్ మృతి

కురవి: కురవి మాజీ ఉప సర్పంచ్ గుగులోత్ స్వామినాయక్(60) మంగళవారం రేకులతండా గ్రామంలో మృతి చెందాడు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ రేకుల తండాకు వెళ్లి గుగులోత్ స్వామి మృతదేహం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు.